క్రిస్మస్ వేడుకలకు సర్వం సిద్ధం



అలంకరణలో సీఎండ్ఐజీ మిషన్ చర్చి



పెనుకొండలోని చర్చిలో ప్రత్యేక అలంకరణ



మడకశిర సీఎండ్ఐజీ చర్చిని అలంకరించిన దృశ్యం

సాక్షిబృందం: క్రిస్మస్ వేడుకలకు చర్చీలు ముస్తాబయ్యాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో అన్ని చర్చీలు, మందిరాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్టార్లు, క్రిస్మస్ ట్రీలను ఆకట్టుకునేలా ఏర్పాటు చేయడంతో చర్చీలు సరికొత్త శోభను సంతరించుకున్నాయి. నెల రోజుల నుంచి అన్ని ప్రాంతాల్లో ముందస్తు క్రిస్మస్ వేడుకలను అత్యంత వేడుకగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచే ఆయా ప్రార్థనాలయాల్లో ప్రార్థనలు ప్రారంభమయ్యాయి.



సీఎండ్ఐజీ చర్చిలో స్టేజ్‌ను అందంగా తీర్చిదిద్దిన దృశ్యం



విద్యుత్‌దీప కాంతులతో వెలిగిపోతున్న జెరుసలెం చర్చి

ఆనందంగా జరుపుకోవాలి



ఉమ్మడి జిల్లాలో ఉన్న క్రైస్తవులందరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు. ఈ పర్వదినాన్ని అందరూ ఆనందంగా జరుపుకోవాలి. రాష్ట్ర ప్రజలందరూ సుఖ, సంతోషాలతో ఉండాలని దేవుడిని ప్రార్థిస్తున్నా. రాష్ట్రం అన్ని విధాలా మరింత వేగంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నా. – శంకరనారాయణ, పెనుకొండ ఎమ్మెల్యే

అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు



మడకశిర నియోజకవర్గంలో ఉన్న క్రైస్తవులందరికీ క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు. ఏ మతం అయినా విశ్వశాంతినే కోరుకుంటుంది. సకాలంలో వర్షాలు కురిసి రాష్ట్రంలోని ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థిస్తున్నాను. అందరూ సంతోషంగా పండుగను జరుపుకోవాలి. – తిప్పేస్వామి, మడకశిర ఎమ్మెల్యే

అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి



హిందూపురం నియోజకవర్గంలోని క్రిస్టియన్ సోదరులు, వారి కుటుంబ సభ్యులందరికీ హృదయ పూర్వకంగా క్రిస్మస్ శుభాకాంక్షలు. కరుణామయుడైన ఏసు ప్రభువు అందరి కుటుంబాల్లో ఆరోగ్యం, ఆనందం కలిగిస్తూ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుంటున్నా. – టీఎస్.దీపిక, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, హిందూపురం

క్లుప్తంగా

వకీలు పెదయ్యకు ఘన నివాళి



వకీలు పెదయ్య సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ, కుటుంబ సభ్యులు

ధర్మవరం: పట్టణంలోని యశోద కాన్సెప్ట్ స్కూల్ సమీపంలో మాజీ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ తండ్రి, మాజీ మున్సిపల్ చైర్మన్ మాలగుండ్ల వకీలు పెదయ్య వర్ధంతి నిర్వహించారు. వకీలు పెదయ్య 18వ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే శంకరనారాయణ, సోదరులు మాలగుండ్ల రవీంద్ర, మాలగుండ్ల మల్లికార్జున, కుటుంబ సభ్యులు పెదయ్య సమాధి వద్ద పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

మడకశిర: మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని సోమవారం ఉదయం 10 గంటలకు ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ఏర్పాటు చేసినట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి బూత్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి పాల్గొంటారని పేర్కొన్నారు.

గీతాపారాయణం పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకురాలు నాగవేణి

హిందూపురం: గీతా పారాయణం రాష్ట్రస్థాయి పోటీలకు స్థానిక ప్రసన్న వేణి గీతామాలికా నుంచి అన్షుమాన్‌రెడ్డి, జోష్నిక ఎంపికైనట్లు అధ్యాపకురాలు నాగవేణి తెలిపారు. ఈమేరకు ప్రకాషం జిల్లాకు తరలివెళ్లారన్నారు. గీతా జయంతి వేడుకలను పురస్కరించుకుని ప్రసన్నవేణి వేదమాలిక ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పార్థసారథి, పీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించాలి



హెచ్‌ఆర్ పాళ్యంలో సర్వే వివరాలను నమోదు చేసుకుంటున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని హెచ్‌ఆర్ పాళ్యం, గుడ్డంపల్లి గ్రామాల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ కవిత , గృహసారథులు, కన్వీనర్లుతో కలిసి హెచ్‌ఆర్ పాళ్యంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌ను అందించారు. ప్రజా సంక్షేమ పాలన అందిస్తూ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందేలా చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో మెళవాయి సర్పంచ్ రంగనాథ్, ఎంపీటీసీ గంగరత్నమ్మ, తాలుకా బూత్ మేనేజర్ సత్యనారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు పాల్గొన్నారు.

మడకశిరలో దొంగల హల్‌చల్

మడకశిర: పట్టణంలోని మారుతీనగర్‌లో శనివారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ప్రధాన రోడ్డులో ఉన్న మూడు ఎలక్ట్రికల్ షాపుల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. మూడు షాపుల్లో దాదాపు రూ.10 వేల వరకు నగదు చోరీ అయినట్లు బాధితులు తెలిపారు. దొంగలు చోరీకి పాల్పడిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి.

గంధం వేడుకలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సజ్జద్‌బాబా

పెనుకొండ: పట్టణంలో ప్రసిద్ధిగాంచిన బాబయ్య స్వామి గంధం వేడుకలను విజయవంతం చేయాలని బాబయ్యస్వామి మొదటి గంధం పీఠాధిపతి సజ్జద్‌బాబా విజ్ఞప్తి చేశారు. ఆదివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. సోమవారం రాత్రి 11 గంటలకు మొదటి గంధం ప్రారంభమవుతున్నారు. పక్కీర్లు, మతపెద్దల ద్వారా గంధంను బాబయ్యస్వామికి సమర్పించడం జరుగుతుందన్నారు. భక్తులు గంధం వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. భక్తులకు అన్నదానం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు.

ఘనంగా గరుడ ఉత్సవం

పెనుకొండ: పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గరుడ ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయమే వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి మంగళవాయిద్యాల నడుమ పట్టణంలో ఊరేగించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.



వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా కనకదాస జయంతి



జ్యోతులతో తరలివస్తున్న మహిళలు

హిందూపురం: పట్టణ పరిధిలోని 13వ వార్డు సడ్లపల్లిలో భక్త కనకదాస జయంతి వేడుకలను కురుబ కులస్తులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సడ్లపల్లిలోని భక్తకనదాస విగ్రహానికి పూలమాలలతో విశేషంగా అలంకరించారు. వార్డులోని కురబల ఆధ్వర్యంలో మహిళలు పెద్దసంఖ్యలో జ్యోతులతో తరలివచ్చి కనకదాస ఆలయంలో సమర్పించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సునీత, వెంకటేష్, గ్రామ కురుబకులస్తులు తదితరులు పాల్గొన్నారు.

గజల్ శ్రీనివాస్‌కు పురస్కారం

పెనుకొండ: పెనుకొండ బాబయ్య దర్గా పీఠాధిపతి అందించే జాతీయ సమైక్యతా జీవన సాఫల్య పురస్కారానికి డాక్టర్ గజల్ శ్రీనివాస్‌ను ఎంపిక చేసినట్లు పీఠాధిపతి తాజ్‌బాబా తెలిపారు. బాబయ్య స్వామి ఉరుసు ఉత్సవాల నేపథ్యంలో సోమవారం సాయంత్రం వేలాది మంది భక్తుల సమక్షంలో పురస్కారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేత



ప్రశంసాపత్రం అందజేస్తున్న సత్యనారాయణమూర్తి

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన బీకాం విద్యార్థిని షఫియాభానుకు జిల్లా సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి ఆదివారం ప్రశంసాపత్రం అందజేశారు. మానవతా విలువలతో కూడిన విద్యపై సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థిని ఉత్తమ ప్రతిభను కనబరచడంతో విద్యార్థినికి ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందించారు.

రోగులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ



రోగులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా సీఅండ్ఐజి మిషన్ కాంపౌండ్ చర్చి సంఘ సభ్యులు ఆదివారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లను పంపిణీ చేశారు. చర్చి పాస్టర్ స్టీఫెన్ రాజు , సంఘ సెక్రటరీ నాగేంద్ర కుమార్, సంఘ ట్రెజరర్ విక్టర్ జాషువా, జాయింట్ సెక్రెటరీ సాల్మన్ రాజ్, జాయింట్ ట్రెజరర్ ఆనంద్ రాజ్, డీకెన్ సభ్యులు జార్జి బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

హిందూపురం అర్బన్: ఆరోగ్యమే మహాభాగ్యమని మణిశరన్ మెమోరియల్ ట్రస్ట్ అధ్యక్షుడు కేవీ చలపతి పేర్కొన్నారు. కిమ్స్ సవేరా ఆస్పత్రి, కడప పుష్పగిరి ఆస్పత్రి సహకారంతో మండలంలోని తూమకుంటలోని ఏపీఐఐసీ భవనంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. తూమకుంట, గోళ్లాపురం , గుడ్డపల్లి ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. న్యాయవాది చంద్ర, వైద్యులు ఇమ్రాన్, షాహిద్, బీజేపీ నాయకులు శివన్న, రఘువేంద్ర, నవీన్, అఖిల్ జగ్గు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి మండల పూజ



పూజకు హాజరైన మాలధారులు

మడకశిర: పట్టణంలో ఆదివారం అయ్యప్పస్వామి మండల పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అయ్యస్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించగా ఉదయం నుంచే ప్రత్యేక పూజలు జరిగాయి. తొలిసారిగా అయ్యప్పస్వామి దీక్షలు తీసుకున్న స్వాములచే జ్యోతి పూజ నిర్వహించారు. పడిపూజను కూడా పెద్ద ఎత్తున నిర్వహించారు. మాలధారులు భజన కార్యక్రమం చేపట్టారు.

బైక్ బోల్తా - యువకులకు గాయాలు

పెనుకొండ రూరల్: బైక్ బోల్తా పడటంతో యువకులు గాయపడిన సంఘటన పట్టణంలోని మిట్ట అంజనేయస్వామి దేవాలయం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాలమేరకు.. లేపాక్షికి చెందిన కిరణ్, నవీన్, వినయ్ ద్విచక్ర వాహనంలో పెనుకొండ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో మిట్ట ఆంజనేయస్వామి దేవాలయం వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తా పడ్డారన్నారు. గాయపడిన వారిని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నేడు వాహనాల వేలం

మడకశిర: మడకశిర సెబ్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను సోమవారం ఉదయం 10 గంటలకు మడకశిర సెబ్‌స్టేషన్ వద్ద బహిరంగ వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ భార్గవ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు ఉదయం 9 గంటలకే సెబ్‌స్టేషన్‌కు చేరుకుని ఆధార్, పాన్ కార్డుతో పాటు వివరాలను సమర్పించాలని కోరారు. వాహనాలకు ముందుగానే ప్రభుత్వం నిర్ణయించిన ధరలో 10 శాతం డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గోరంట్ల: స్థానిక బజాజ్ షోరూమ్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలసముద్రం గ్రామానికి చెందిన రహమాన్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాలమేరకు... రహమాన్ గోరంట్ల వైపు నుంచి ద్విచక్ర వాహనంలో పాలసముద్రం వెళ్తుండగా బజాజ్ షోరుమ్ సమీపంలో హిందూపురం– గోరంట్ల ప్రధాన రహదారిపై ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీ కొందన్నారు. రహమాన్ తీవ్రంగా గాయపడగా స్థానికులు గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించినట్లు చెప్పారు.

తపాలా ఉద్యోగి అరెస్ట్

పావగడ: ఓటీపీని దుర్వినియోగం చేసి తపాలాశాఖలో రూ 5.28 లక్షలను స్వాహా చేసిన తపాలాశాఖ ఉద్యోగి ముంగారు వంశీ కృష్ణను తుమకూరు సైబర్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. స్థానిక పోలీసుల వివరాలమేరకు... తాలూకాలోని న్యాయదకుంటె గ్రామం పోస్టాఫీసులో ఐదేళ్ల క్రితం తపాలా ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న కడప జిల్లా రాయచోటి తాలూకా సామేపల్లికి చెందిన ముంగారు వంశీ కృష్ణ ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు ఖాతాల నుంచి వినియోగదారుల ఖాతాలకు నగదు బదిలీ చేసి అనంతరం ఆ సొమ్మును తన అకౌంట్‌కు బదిలీ చేసుకుని దోపిడీ చేశారన్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టగా అప్పటికే నిందితుడు దుబాయ్‌కు ఉడాయించాడన్నారు. ఇటీవల దుబాయ్ నుంచి తిరిగి రావడంతో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

జేసీబీని ఢీ కొన్న బైక్

పెనుకొండ రూరల్: జేసీబీ వాహనాన్ని ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో ఇద్దరు గాయపడిన సంఘటన గోనిపేట బ్రిడ్జి సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గోనిపేటకు చెందిన భార్గవరెడ్డి, భరత్ ద్విచక్ర వాహనంలో గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో గోనిపేట బ్రిడ్జీ సమీపంలోని మౌలాలి కళాశాల వద్దకు రాగానే రోడ్డును దాటుతున్న జేసీబీని ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు.

అక్షింతల ఊరేగింపు

రొళ్ల: మండల పరిధిలోని జీరిగేపల్లి అమ్మాజి, కాల్వేపల్లి రంగనాథస్వామి ఆలయాల్లో ఆదివారం విశ్వ హిందూ ధర్మ రక్షణ సమితి సభ్యుల (శ్రీరామ సేన) ఆధ్వర్యంలో అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షింతలతో ఊరేగింపు నిర్వహించారు. త్వరలోనే బీజీ హళ్లి, మల్లినమడుగు పంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లోని ప్రజలకు అక్షింతలు పంచి పెడతామన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్ వ్రతం



అగళి మండలం కోడిపల్లిలో అలంకరణలో ఆంజనేయస్వామి



కొంకల్లులో జ్యోతులతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు



అలంకరణలో రొళ్ల మండలం ఆవినకుంట ఆంజనేయస్వామి

సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో హనుమద్ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించారు. స్వామివార్ల మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆయా ప్రాంతాల్లో భక్తులు ఆలయాలకు తరలివెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.



హిందూపురం: అలంకరణలో పంచముఖ ఆంజనేయస్వామి



అమరాపురం మండలం పుల్లీకుంటలో జలధి ఉత్సవం



పరిగి: ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి